రోడ్లెప్పుడేస్తావు బాబూ..?

చంద్రబాబు కుప్పం నియోజక వర్గం నుంచి ఎనిమిది పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచారు. మూడు పర్యాయాలు సీఎంగా చేశారు. 4వ సారి సీఎంగా కొనసాగుతున్నారు. మాట్లాడితే 40 ఇయర్స్ పొలిటికల్ ఇండస్ట్రీ అని గొప్పలు చెప్పుకునే ఆయనకు కుప్పం మండలంలో రోడ్లకు నోచుకుని గ్రామాలు బాబు దశాబ్దాల ప్రాతినిధ్యాన్ని పరిహసిస్తున్నాయి. టీడీపీ అధికారంలో ఉన్న ప్రతిసారీ తమ మద్దతుదారులు ఉన్న ప్రాంతాల్లో మాత్రమే అభివృద్ధి పనులు చేస్తారనే విమర్శలు అక్షరాల వాస్తవమేనని ప్రజల్ని ఎవరిని కదిపినా నిష్ఠూరంగా చెప్పేమాట ఇదే. గత, ప్రస్తుతం బాబు హయాంలో సీసీ రోడ్లు ఒక్కో ఇంటికి వందల మీటర్లు వేశారు! కానీ బాబుతో పాటు తన కోటరి నాయకులు, అధికారులకు రోడ్లు లేక అవస్థలు పడుతున్న గ్రామాలు మాత్రం కానరావడం లేదు. ఇప్పటికీ బాబు ఇలాకాలో రోడ్లు లేని గ్రామాలు ఉన్నాయంటే నమ్ముతారా..!? రండి మచ్చుకు కొన్ని చూద్దాం.

- ఇప్పటికీ కుప్పంలో రోడ్లు లేని గ్రామాలెన్నో..!
- బాబుకు అస్సలు పట్టించుకోని సీసీ, బీటీ రోడ్లు
- టీడీపీ మద్దతుదారులు ఉన్న చోటే అధికంగా రోడ్లు
- ఒకే ఇల్లున్నా సిమెంట్ రోడ్డు వేసిన వైనం..!


రైల్వే బ్రిడ్జి కింద వెళ్లే పలవరిగానిమిట్టకు ఉన్న మట్టి రోడ్డు

కుప్పం రూరల్: కుప్పం మండలానికి చెందిన ఊరునాయునికొత్తూరులో 85 కుటుంబాలు ఉన్న వెనుకబడిన గ్రామం. గ్రామం ఆవిర్భావం నుంచీ రోడ్డు సౌకర్యం లేకపోవడంతో పొలం గట్లపైనే రాకపోకలు సాగించేవారు. హంద్రీ–నీవా కాలువ తవ్విన తరువాత కాలువ పక్కన రాకపోకలు సాగిస్తున్నారు. వర్షం పడితే కాలువ పక్కన ఉన్న మట్టిదారి బురదమయమై రాకపోకలకు అవస్థలు పడాల్సిందే. అత్యవసర సమయాల్లో వీరు పడుతున్న పాట్లు చెప్పనలవి కాదు. తమ గ్రామానికి రోడ్డు వేయండి మహాప్రభో అని అధికార పార్టీ నాయకులను ఎన్నోసార్లు గ్రామస్తులు కోరినా ఫలితం శూన్యం.

పలవరిగానిమిట్ట

ఈ గ్రామం పరిస్థితి మరీ దారుణం. ఓటర్ల పరంగా కుప్పం మున్సిపాలిటీలో ఈ గ్రామం ఉన్నా రోడ్డు వసతికి మాత్రం నోచుకోలేకపోయింది. 30 కుటుంబాలు ఉన్న పలవరిగానిమిట్ట గ్రామానికి రోడ్డువసతి లేకపోవడంతో రైల్వే బ్రిడ్జి కింద రాకపోకలు సాగించాల్సి వస్తోంది. దళవాయికొత్తపల్లె చెరువుకు వర్షపు నీరు ఈ కిందే వెళ్తుండడంతో వర్షాకాలంలో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోతాయి. గ్రామస్తులు కుప్పంకు చేరుకోవాలంటే గుత్తార్లపల్లె చుట్టుకుని శ్మశానం మీదుగా వెళ్లాల్సి వస్తోంది. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి తలచుకుంటే ఈ గ్రామానికి రోడ్డు వసతి రాదా..? అని కొంతమంది సూటిగా ప్రశ్నిస్తున్నా సమాధానం చెప్పేవారు లేరు.


కంకర తేలిన మల్లెకుంటకు వెళ్లే మట్టిరోడ్డు, (ఇన్‌సెట్) హంద్రీ–నీవా కాలువ పక్కన ఊరునాయునికొత్తూరుకు ఉన్న మట్టిరోడ్డు

మల్లెకుంట

మండలంలోని ఉర్లవోబనపల్లె పంచాయతీకి చెందిన అటవీ గ్రామం మల్లెకుంట. ఈ గ్రామంలో 15 కుటుంబాలున్నాయి. నడుమూరు– కూర్మానుపల్లె రోడ్డు నుంచి 2 కిలోమీటర్లు కంకర తేలిన మట్టిరోడ్డులో ప్రయాణిస్తే గానీ గ్రామానికి వెళ్లలేరు. వర్షాకాలంలో రోడ్డు కోతకు గురై రాకపోకలు బంద్ అవుతుంటాయి. స్కూళ్ల పిల్లలు, వృద్ధులకు ఈ మార్గం నరకం చూపుతోంది. ఇంత దారుణ పరిస్థితులు ఉన్నా, గ్రామం రోడ్డుకు నోచుకోలేదు.

కంసలవానికుంట

పైపాళ్యం పంచాయతీలో అటవీ సమీపంలోని కంసలవానికుంట గ్రామంలో 15 కుటుంబాలు ఉన్నాయి. మోట్లచేను రోడ్డు నుంచి రోడ్డు వసతి లేకపోవడంతో రాళ్లూరప్పల మధ్య ఉన్న మట్టిరోడ్డులోనే రాకపోకలు సాగిస్తున్నాయి. పక్కనే ఉన్న చెక్కునత్తం పంచాయతీలో 40, 50 మీటర్ల లెక్కన ఒక్కో ఇంటికి సీసీ రోడ్లు వేసినా కంసలవానికుంటలో మాత్రం తారు రోడ్డు వేసిన పాపానపోలేదు. దీంతో గ్రామస్తులు రాకపోకలకు మట్టిరోడ్డే దిక్కైంది.


కంసలవానికుంటకు ఉన్న మట్టిరోడ్డు

పట్టించుకున్నోళ్లెవరూ లేరు



మా ఊరు కుప్పం మున్సిపాలిటీ పరిధిలో ఉన్నా వసతులు మాత్రం లేవు. కనీసం రోడ్డు కూడా లేదు. రాళ్లూరప్పలు ఉన్న దారే మాకు గతి. మా గ్రామానికి రైల్వే లైన్లు, డంపింగ్ యార్డు రూపంలో రెండు గ్రహాలు పట్టుకున్నాయి. రైల్వే అండర్ బ్రిడ్జి కిందే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఈ మార్గంలోనే డంపింగ్ యార్డు ఉండడంతో ఒకటే కంపు. దీనివల్ల అందరికీ ఇబ్బందే. ఎంతో మంది అధికారులు, నాయకులకు మా గోడు చెప్పినా పట్టించున్న పుణ్యాత్ములెవరూ లేరు. ఎప్పటికి తీరుతుందో మా గ్రామం రోడ్డు సమస్య.

–మురళి, పలవరిగానిమిట్ట

క్లుప్తంగా

తాళ్లపల్లెలో 'పొలం పిలుస్తోంది'


రైతులతో మాట్లాడుతున్న ఏఓ హేమలత

గంగవరం: మండలంలోని తాళ్లపల్లె రైతు సేవా కేంద్రంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయాధికారి వ్యవసాయాధికారి హేమలత నిర్వహించారు. పంటలకు తగిన మోతాదులో మందులను పిచికారీ చేసి, వేసవిలో అన్ని పంటలకు ఎక్కువ శాతం నీటి తడి ఉండేలా కాపాడుకోగలిగితే దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని రైతులకు చెప్పారు. అనంతరం గ్రామంలో సాగులో ఉన్న పంటలను పరిశీలించారు. వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రీ సర్వేకు సహకరించండి


రైతులతో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

బైరెడ్డిపల్లె: మండలంలో చేస్తున్న రీ సర్వే పనులకు రైతులు సహకరించాలని విజయవాడ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి నాగేశ్వరరావు కోరారు. మంగళవారం మండలంలోని మూల తిమ్మేపల్లెలో రీ సర్వేను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రైతులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రీ సర్వేలో తప్పిదాలను సరిచేస్తున్నట్టు చెప్పారు. జరుగుతుందన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా సర్వేనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ మాధవరాజు, డీటీ రామమూర్తి, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.


రీ సర్వే పనుల పరిశీలన

పెద్దపంజాణి: మండలంలోని చలమంగళం గ్రామ పంచాయతీలో రీ సర్వే పనులను ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్(నోడల్ ఆఫీసర్, విజయవాడ) నాగేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. చలమంగలం పెద్దచెరువు సర్వే నంబర్ 279ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ క్రిష్ణమూర్తి, తహసీల్దార్ అనిల్ కుమార్, రీ–సర్వే డీటీ రమేష్ బాబు, మండల సర్వేయర్ సాయిరాజ్ నాయక్, ఆర్‌ఐ రాకేష్ కుమార్, వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

రేషన్ కార్డుదారులకు ఈకేవైసీ తప్పనిసరి


పెద్దపంజాణి: రేషన్‌కార్డులో నమోదైన సభ్యులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ సీఎస్.అనిల్‌కుమార్ కోరారు. మంగళవారం తన కార్యాలయంలో రేషన్ డీలర్లకు సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. కార్డులోని ప్రతి సభ్యుడు ఈకేవైసీ చేయించుకుంటేనే ఉచిత బియ్యం డీలర్లకు అలాట్‌మెంట్ అవుతుందన్నారు. ఈనెల 24వ తేదీ లోపు ఈకేవైసీను పూర్తిచేయాలన్నారు. రోజూ ఎండీయూకు పంపిణీ చేసే అలాట్‌మెంట్, స్టాక్ వివరాలు నమోదుచేయాలని ఆదేశించారు. ఆథరైజేషన్ పొందిన డీలర్లు జెరాక్సులను కార్యాలయంలో ఇవ్వాలన్నారు. ప్రతి కార్డుదారునికి తప్పనిసరిగా బియ్యం అందేలా చూడాలన్నారు. సమావేశంలో ఆర్‌ఐ రాకేష్‌కుమార్, వీఆర్వోలు, డీలర్లు పాల్గొన్నారు.

ఆగని గజదాడులు


దెబ్బతిన్న పంటను అటవీశాఖ అధికారులకు చూపుతున్న రైతు

యాదమరి: మండలంలో గజదాడులు కొనసాగుతున్నాయి. సిద్ధారెడ్డిపల్లె పంచాయతీకి చెందిన రైతు అయ్యస్వామిరెడ్డి వరి పంటను మంగళవారం ఏనుగులు ధ్వంసం చేశాయి. బాధిత రైతు ఫిర్యాదు మేరకు అటవీశాఖ అధికారులు ఏనుగుల దాడిలో ధ్వంసమైన పంటను పరిశీలించారు. పంట నష్టం అంచనా వేసి ఉన్నతాధికారుల నివేదిక సమర్పిస్తామని అటవీశాఖ అధికారులు చెప్పారు. గజదాడులను కట్టడి చేసేందుకు శాఖ అధికారులు ప్రయత్నం చేస్తున్నా..ఫలితం మాత్రం శూన్యం. ప్రస్తుతం రాచూరు అటవీ బీట్ పరిధిలో 14 ఏనుగులు హల్‌చల్ చేస్తున్నట్లు సమాచారం.

సాయిబాబా ఆలయ కుంభాభిషేక పూజలు


కుంభాభిషేక పూజల్లో భక్తులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం కట్టమంచిలోని శ్రీవిశ్వ షిరిడి సాయిబాబా ఆలయంలో మంగళవారం కుంభాభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి అభిషేకం, కలశ పూజలు శాస్త్రోక్తంగా చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా పుష్పపల్లకి


పుష్పపల్లకిలో ముస్తాబైన వీరాంజనేయస్వామి

గుడుపల్లె: మండలంలో సాలచింతనపల్లెలోని శ్రీ ప్రసన్న వీరాంజనేయస్వామి పుష్పపల్లకి సేవ మంగళవారం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో పూజలు, హోమాలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి, రంగు రంగుల పుష్పాలతో తీర్చిదిద్దిన పల్లకి కొలువుదీర్చి, మంగళ వాయిద్యాల హోరు నడుమ గ్రామంలో ఊరేగించారు. రాత్రి భక్తుల కాలక్షేపం కోసం బాణవేడుకలు, పౌరాణిక నాటకాలు, కోలాటాలు ప్రదర్శించారు. భక్తులకు అన్నదానం చేశారు.

జాబ్‌మేళాలో 32మందికి ఉద్యోగాలు


జాబ్‌మేళాలో మాట్లాడుతున్న అధికారి

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం రాష్ట్ర నైపుణ్యాల అభివృద్ధి సంస్థ, సీడాప్, డీఆర్‌డీఏ సంయుక్తంగా జాబ్‌మేళా నిర్వహించారు. హాజరైన 84మందిలో ప్రతిభ ఆధారంగా 32మందికి వివిధ బహుళజాతి కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక చేసినట్టు జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి సిసింద్రీ తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సామాజిక సేవ అభినందనీయం

తవణంపల్లె: సామాజిక సేవల్లో జర్నలిస్టుల పాత్ర అభినందనీయమని స్థానిక తహసీల్దార్ సుధాకర్ అన్నారు. తవణంపల్లె ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. దీన్ని తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ రెడ్డిబాబు, ఎస్‌ఐ చిరంజీవి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అనంతరం స్థానిక వైద్యాధికారి ప్రియాంక, అపోలో వైద్యులు డాక్టర్ ప్రీతి, విద్యార్థులు జ్యోతిప్రజ్వలన చేశారు. ఉచిత మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. అతిథులు మాట్లాడుతూ ఎంతో ఒత్తిడితో విధులు నిర్వర్తిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు ప్రెస్‌క్లబ్ ద్వారా వైద్య పరీక్షలు చేయించి ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. సుమారు 300 మందికి వైద్య పరీక్షలు చేయించారు. బీపీ, సుగర్, ఈసీజీ, ఎకో పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో అరగొండ అపోలో హాస్పిటల్ జీఎం డాక్టర్ వినోద్‌కుమార్, బీఎం చంద్రశేఖర్ రెడ్డి, వైద్యాధికారి మోహన్‌వేలు, ఏఓ ప్రవీణ్, ఏపీఎం రవి, హెచ్‌ఎం దేవరాజులు రెడ్డి, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు లోకనాథం, చిత్తూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు రమేష్‌బాబు, కాళేశ్వర్‌రెడ్డి, తవణంపల్లె ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

వారపు సంత వేలం

చౌడేపల్లె: స్థానిక వారపుసంత గేటు వసూలు హక్కుపై బుధవారం పంచాయతీ సచివాలయ ఆవరణంలో వేలం నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి మహేష్ తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.5లక్షల డిపాజిట్‌తోపాటు సాల్వెన్సీ ఉండాలి. ఇక, ప్రైవేటు బస్టాండుకు రూ.30 వేలు, కొబ్బరి చెట్ల వేలంలో రూ.1000 డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని తెలియజేశారు.

వి.కోట పంచాయతీలో..

వి.కోట: స్థానిక పంచాయతీ కార్యాలయంలో బుధవారం మార్కెట్ల వేలం నిర్వహిస్తున్నట్టు సర్పంచ్ పీఎస్ లక్ష్మి మంగళవారం తెలిపారు. వారపు సంత, దినసరి కూరగాయల మార్కెట్, ప్రైవేట్ మార్కెట్, వారపు పశువుల సంత, గొర్రెల సంత, కమ్యూనిటీ సంత, కమ్యూనిటీ లెట్రిన్లు, జంతువధశాల మార్కెట్లకు వేలం నిర్వహిస్తామని, ఆసక్తి కలవారు పాల్గొనాలని కోరారు.

22న జాబ్ మేళా

పుంగనూరు: పట్టణ సమీపంలో గూడూరుపల్లె ఉన్న ఐటీఐలో ఈనెల 22న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి పద్మజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి, ఐటీఐ, ఇంటర్, ఏదైనా డిగ్రీ, ఎంబీఏ పూర్తి చేసిన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని ఆమె కోరారు. జాబ్‌మేళాకు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరై అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తారని తెలియజేశారు.

22న ఉచిత కంటి వైద్య శిబిరం

పుంగనూరు: ఈనెల 22న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ స్థానిక శాఖ అధ్యక్షుడు చెంగారెడ్డి తెలిపారు. చెన్నైకు చెందిన శంకర్ నేత్రాలయ నిపుణులు వైద్య పరీక్షలు చేస్తారని, మండల ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్కూళ్లను తనిఖీ చేసిన డీపీఓ


బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీపీఓ సుధాకర్

పలమనేరు: మున్సిపాలిటీలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్ మంగళవారం తనిఖీ చేశారు స్థానిక బాలికోన్నత పాఠశాలలో మంచినీటి వసతి, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజనం మొదలైన వాటిని పరిశీలించి హెచ్‌ఎంలు, టీచర్లతో మాట్లాడారు. అనంతరం పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, మేనేజర్ ఖాదర్ మొహిద్దీన్, ఎంఈఓ బాలసుందరం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నజ్మా తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అప్రమత్తం


ఇంటింటా సర్వే చేస్తున్న వైద్యశాఖ సిబ్బంది

పలమనేరు: వారం రోజులుగా ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలకు చేరడంతో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు తగుజాగ్రత్తలు పాటించాలని స్థానిక సబ్‌యూనిట్ అధికారి జైశంకర్ కోరారు. పట్టణంలోని గడ్డూరు కాలనీలో జ్వరాలపై ఇంటింటా సర్వే చేశారు. ఆయన మాట్లాడుతూ, ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఉదయం 12 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జనం ఎండలో ప్రయాణం, ఇతరత్రా పనులు మానుకోవాలన్నారు. తరచూ కొబ్బరిబొండాలు, కర్బూజ వంటివి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నియామకం


మునిరాజులు

పలమనేరు: పలమనేరు మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ అడ్వొకేట్‌గా మునిరాజులు నియమితులయ్యారు. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి ఆయనకు నియామక పత్రాన్ని మంగళవారం అందజేశారు. మూడేళ్లపాటు ఆయన సేవలు అందిస్తారు. మున్సిపల్ ఆస్తుల పర్యవేక్షణ, కేసుల విషయంలో రాజీ లేకుండా కృషి చేస్తానని ఆయన తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్‌ఐ మినహా స్టేషన్ మొత్తం బదిలీ..!

- ఇద్దరు ఏఎస్‌ఐలు, 13 మంది హెడ్ కానిస్టేబుళ్లు ట్రాన్స్‌ఫర్

రొంపిచెర్ల: రొంపిచెర్ల పోలీసుస్టేషన్‌లో భారీగా పోలీసుల బదిలీలు జరిగాయి. ఇక్కడ పని చేస్తున్న వారిలో ఎస్‌ఐ సుబ్బారెడ్డి మినహా ఇద్దరు ఏఎస్‌ఐలు, మరో 13మంది హెడ్ కానిస్టేబుళ్లను జిల్లా ఎస్పీ బదిలీ చేశారు. ఏఎస్‌ఐలు తులసీరామ్‌ను చిత్తూరు–2 టౌన్‌కు, మధుసూదన్‌ను యాదమర్రికి, పూతలపట్టు నుంచి ఎస్వీ.రమణ్‌రావును, చిత్తూరు తాలుకా పీఎస నుంచి కె.రవిచంద్రన్‌ను రొంపిచెర్లకు బదిలీ చేశారు. అలాగే ఇక్కడి నుంచి కె.చలపతి నాయుడు, ఆర్.మధుసూధన్ రెడ్డి, నీలా కృష్ణయ్య శెట్టి, కె.రాజేంద్రనాయుడు, చిట్టిబాబు, సుబ్బయ్య, కె.చిట్టెమ్మ, హనీఫ్‌బాషా, సురేష్‌కుమార్, వేంకటేశు, కార్తీక్, పురుషోత్తం, వేణు లను చిత్తూరు ఉమ్మడి జిల్లాలోని పీఎస్‌లను బదిలీ చేయగా, అలాగే రొంపిచెర్లకు మనోహర్, శ్రీనివాసులు, నరసింహులు, ఏలుమలై రెడ్డి, రవి, మహేష్, రాజశేఖర్, వినోద్‌కుమార్, కృష్ణంరాజు, జానకిరామ్, దినేష్‌కుమార్‌లను బదిలీ చేశారు.

దళితుల సమస్యలను పరిష్కరించాలి

- ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సమావేశంలో నాయకుల వినతి


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ కిరణ్‌కుమార్

రొంపిచెర్ల: దళితుల సమస్యలను అధికారులు పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ నాయకులు తహసీల్దార్ కిరణ్‌కుమార్‌ను కోరారు. మంగళవారం తహసీల్దార్ అధ్యక్షతన మండల ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ, గానుగచింత నగిరిలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని, జగడంవారిపల్లె, పెద్ద హరిజనవాడ గ్రామాలకు శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. జగడంవారిపల్లెలో తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. మినీ గోకులం షెడ్ల మంజూరులో ఎస్సీ, ఎస్టీలకు తీవ్ర అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండవ విడతలో గోకులం షెడ్లను ఎస్సీ, ఎస్టీలకే మాత్రమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలపై తహసీల్దార్ సానుకూలంగా స్పందించారు. సమావేశంలో ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, ఎంఈఓ ఇందిర, శ్రీనివాసులు, మండల పశు వైద్యాధికారి శ్రీధర్, పీహెచ్‌సీ డాక్టర్ దినేష్ కుమార్ నాయక్, ఏఎస్‌ఐ తులసీరామ్, ట్రాన్స్‌కో ఏఈ రాంప్రసాద్, ఏపీఓ బాలమురళి, ఏఓ సుధారాణి, ఎస్సీ, ఎస్టీ కులాల నాయకులు సుభాష్, హరిబాబు, ఓబులేసు, ఆవుల చంద్రయ్య, రమేష్, గిరి, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

భిన్న వాతావరణం



ఉదయం మంచు.. మధ్యాహ్నం ఎండ

మండలంలో ప్రస్తుతం భిన్నమైన వాతావరణం నెలకొంది. ఉదయం వేళ దట్టమైన పొగమంచు కురుస్తుండగా..మధ్యాహ్నానికి ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. రాత్రి వేళల్లోనూ ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి.

–సదుం

కంటి ఆపరేషన్లకు 93మంది ఎంపిక




పలమనేరు: కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు, హాజరైన రోగులు, వి.కోట: కంటి ఆపరేషన్లకు ఎంపికైన వారు

పలమనేరు: స్థానిక పీపీఎస్, ఏపీఎన్జీవోల ఆధ్వర్యంలో మంగళవారం ఎన్జీవో కార్యాలయంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. శిబిరంలో 210మందిని అమెరికన్ లేజర్ కంటి ఆస్పత్రి వైద్యులు వైద్య పరీక్షలు చేసి 60 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్టు నిర్వాహకులు సుబ్రమణ్యం, నరసింహులు తెలిపారు.

వీ.కోటలో 26మంది..

వి.కోట: పట్టణంలో మంగళవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ, మొగసాల ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత కంటి మెగా వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. నిర్వాహకులు మొగసాల రెడ్డెప్ప మాట్లాడుతూ, శిబిరంలో 75 మందికి శంకర కంటి ఆస్పత్రి (బెంగళూరు) నిపుణులు వైద్య పరీక్షలు చేసి 26 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారని చెప్పారు. అలాగే వారికి ఆపరేషన్ అనంతరం కళ్లద్దాలు ఇవ్వడంతో పాటు వారిని ఆయా గ్రామాలకు చేరుస్తామని చెప్పారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

బైరెడ్డిపల్లె: స్థానిక అగస్త్య పబ్లిక్‌స్కూల్ ఆవరణలో మంగళవారం మొగసాల ట్రస్ట్ నిర్వహించిన ఉచిత కంటి ఆపరేషన్ల మెగా వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈశిబిరంలో 30 మందికి బెంగుళూరు శంకర కంటి ఆసుపత్రి వైద్య నిపుణులు పరీక్షించి ఏడుగురిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వారిని బెంగళూరుకు తీసుకెళ్లి ఆపరేషన్లు చేయిస్తామని, భోజన వసతి కల్పిస్తామని నిర్వాహకులు చెప్పారు.